


పాదగయ క్షేత్రంలో పవన్‌కల్యాణ్‌కు పురుహూతిక అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న పండితులు

ఈస్టర్ వేడుకలు - 6లో


గండేపల్లి మండలం జెడ్.రాగంపేట చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

జిల్లావ్యాప్తంగా ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున శ్మశానవాటికల్లో తమ కుటుంబీకుల సమాధుల వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో పాస్టర్లు సందేశమిచ్చారు.

వైసీపీని.. తరిమికొడదాం..

పిఠాపురాన జనసేనాని పిలుపు

- 40 రోజులు దీక్షగా చేయాల్సిందే
- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- వైసీపీ కుతంత్రాలను తిప్పికొట్టండి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వెల్లువెత్తిన పవన్ అభిమానులు
- స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌కు
- నేటి ఉదయం గొల్లప్రోలుకు రాక


పిఠాపురంలో పవన్ అభివాదం


వర్మను వదలను..


పాదగయ క్షేత్రంలో పూజ చేసి వెళుతున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 31: వైసీపీ పాలన తరిమికొట్టడమే లక్ష్యంగా మండల దీక్ష మాదిరి 40 రోజులు కష్టించి నిష్ఠగా గెలుపుకోసం పనిచేద్దామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అనేక కుతంత్రాలకు పాల్పడుతుందని, వాటన్నింటిని సమిష్టిగా తిప్పికొడదామన్నారు. పిఠాపురంలో తన గెలుపు చరిత్రలో నిలిచి పోయేవిధంగా ఉండాలన్నారు. పిఠాపురంలో తన గెలుపు బాధ్యత తీసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచిన అనంతరం వర్మ గౌరవానికి, మర్యాదకు భంగం కలగకుండా చూసుకుంటానని చెప్పారు. వర్మ నాయకత్వ పటిమ, సమర్థత, ప్రతిభ తాను పూర్తిగా అర్థం చేసుకున్నానని తెలిపారు. చంద్రబాబు గీసిన గీత దాటను అని వర్మ చెప్పడం తనకు ఆనందం కలిగించిందని చెప్పారు. వర్మకు భవిష్యత్తులో మంచి స్థానం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వర్మ గురించి మాట్లాడుతున్నంత సేపు ఆయన చేతిని పవన్‌కల్యాణ్ పట్టుకునే ఉన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై మూడు పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌పై పవనకల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ఉదయ శ్రీనివాస్ కష్టించి ఎదిగిన యువకుడు అన్నారు. 2017లో రూ.10 లక్షలతో టీటైం స్థాపించిన ఆయన ప్రస్థానం ఇప్పుడు దేశం దాటి నేపాల్ వరకూ విస్తరించిందని తెలిపారు. యువత తెలివితేటలకు ఉదయ శ్రీనివాస్ ప్రత్యక్ష తార్కాణమని చెప్పారు. ఈయన ఇక్కడ సం పద సృష్టించి చూపుతాడని తెలిపారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సునీల్ మంచి వ్యక్తే అయినా తప్పుడు పార్టీలను ఎంచుకుంటారని చెప్పారు. ఆయన ఇక్కడ సంపదను పట్టుకుపోతాడని వ్యాఖ్యానించారు. నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు, భేదాభిప్రాయాలు ఉన్నా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం అనే రెండు అజెండాలుగా సమిష్టిగా ఎన్నికలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. పిఠాపురం సమన్వయకర్తగా అనపర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించారు. సమావేశంలో పవన్‌ను టీడీపీ, బీజేపీ నాయకులు సత్కరించారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, గిరీష్‌వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు అదే అభిమానం..

రెండో రోజు.. అదే జోరు.. ఎటు చూసినా జనమే.. జనం.. పవనాభిమానులు వెల్లువెత్తారు. దారి పొడవునా ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు.. మహిళలు హారతులు పట్టారు. తమ అభిమాన నాయకుడు పవన్‌ను చూసేందుకు మహి ళలు డాబాలు ఎక్కడంతో పాటు పూల వర్షం కురిపించారు. వారందరికి పవన్ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.జనాభిమానానికి పులకించిన పవన్ కారు ఓపెన్ టాప్ నుంచి వారికి నమస్కరించి చేతులు జోడించి అభివాదం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తొలిరోజు రోజు పర్యటన అనంతరం పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10.50 గంటల సమయంలో అక్కడ నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రం చేరుకుని పుర్హుతికాశక్తి పీఠాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. పాదగయ జంక్షన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభించారు. హైదరాబాద్ తిరిగి వెళ్లేందుకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు జనసేన, టీడీపీ నాయకులు, అభిమానులు ఆదివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు.




మీ వెంటే : బిల్డింగ్ పైనుంచి పవన్‌ను చూస్తున్న మహిళలు.. కూటమి సమావేశంలో మాట్లాడుతున్న పవన్

హైదరాబాద్‌కు పయనం

నాలుగు రోజులు పాటు పిఠాపురంలోనే ఉంటానని పవన్‌కల్యాణ్ ముందుగానే ప్రకటించారు. అయితే పవన్ జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. దీంతో కొత్తపల్లి మండలంలోని బషీర్‌బీబీ దర్గా సందర్శనను రద్దు చేసుకుని పిఠాపురంలో ఆలయాల సందర్శనకే పరిమితమయ్యారు. కూటమి పార్టీల కార్యకర్తల సమావేశం అనంతరం గోకులం గ్రాండ్ నుంచి నేరుగా గొల్లప్రోలులోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. పవన్ హెలికాప్టర్ టేకాఫ్‌కు సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే ఏటీసీ నుంచి అనుమతి ఉంది. దీంతో ఆయన కార్యకర్తల సమావేశాన్ని ముగించుకుని వచ్చారు. సాయంత్రం 5.08 గంటలకు హెలికాప్టర్ టేకాఫ్ కావడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అస్వస్థతగా ఉన్న పవన్ చికిత్స చేయించుకునేందుకే హైదరాబాదు వెళ్లారని ఆ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తిరిగి గొల్లప్రోలుకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు.

సచివాలయ సిబ్బందితోనే
పింఛన్ల పంపిణీ

- ఆధార్‌గానీ, ఇతర గుర్తింపుకార్డులుగానీ చూపించాలి
- వలంటీర్లను పక్కన పెట్టిన ప్రభుత్వం

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 31: వైఎస్సార్ పింఛన్ల పంపిణీని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పంపిణీ చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలు కోడ్ ఉన్న నేపథ్యంలో వలంటీర్లను పూర్తిగా పక్కన పెట్టేసింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ అండ్ విద్యా సహాయకుల ద్వారా పంపిణీ చేయాలని పేర్కొంది. నగరాల్లో అయితే సచివాలయ వార్డు పరిపాలన కార్యదర్శి, సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. వితంతు, వికలాంగు, వృద్ధులు సచివాలయానికి వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాల్సి ఉంది. సచివాలయానికి వెళ్లే లబ్ధిదారులు తమ వెంట ఆధార్ కార్డుగానీ, ఇతర గుర్తింపుకార్డులనుగానీ తీసుకెళ్లాలి. పింఛన్‌దారుల పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ ఉన్నందున దాన్ని తీసుకెళ్లవద్దని సూచించారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బందికి అవసరమైన మొబైల్స్, టాబ్లెట్స్, స్కానర్లు, ఇతర పరికరాలను జిల్లా అధికారులు అందజేయాలని సూచించింది. వీటి పంపిణీకి సంబంధించిన ఫొటోలను పబ్లిసిటీ నిమిత్తం ఉపయోగించకూడదు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆథరైజేషన్ లేఖలను సచివాలయ ఉద్యోగులకు ఇవ్వాల్సి ఉంది. దీనిప్రకారం బ్యాంకునుంచి నగదు విత్‌డ్రా చేసుకుని సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారు. జిల్లాలో 2,82,422మంది ఉండగా వీరికి ప్రతినెల రూ.83.70కోట్లు పింఛన్ల నిమిత్తం పంపిణీ చేస్తున్నారు. మొత్తం జిల్లాలో ఉన్న 21 మండలాల్లో ఈ పంపిణీ ఇక సచివాలయం సిబ్బంది ద్వారా జరుగుతుంది.

వలంటీర్లకు చెక్

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వలంటీర్లను ప్రభుత్వం పక్కన పెట్టింది. నగదు పంపిణీకి ఏ పథకాల్లో వీరిని ఉపయోగించవద్దని ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి వీరిని దూరంగా ఉంచారు.

ఊరూరా మందే మందు

- గ్రామాల్లో బెల్టు షాపుల జోరు
- అధికార పార్టీ నేతల అండదండలతో విచ్చలవిడిగా మద్యం సరఫరా


లోవ కొత్తూరు సమీపంలో బెల్టుషాపు వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

తుని రూరల్, మార్చి 31: మద్యం మత్తులో యువత పెడదారి పడుతోంది. అనేక గొడవలకు దారి తీస్తోంది. రాత్రి 8గంటలు అయితే చాలు మద్యంషాపులు ఎక్కడో ఉన్నాయో వెతుక్కుంటూ బండ్లు పరిగెత్తుతున్నాయి. రాత్రి 8గంటల నుంచి అర్థరాత్రి ఒంటి గంట వరకు మత్తులో ఊగుతూ అనేక గొడవలు, ప్రమాదాలకు గురై అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఘటనల్లో తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిలుస్తున్నారు.

ప్రభుత్వం మద్యం దుకాణాలు లేని సమయంలో రూ.50 ఎక్కువ ఇస్తే చాలు ఎంత మందు కావాలంటే అంత మందు డోర్ డెలివరీ చేస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు తుని నియోజకవర్గ, పట్టణ గ్రామాల్లో ప్రభుత్వం మద్యం దుకాణాలనుంచి విచ్చలవిడిగా అధికార పార్టీ నేతల అండదండలతో మద్యం కేసులు అమ్ముతున్న పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం మొదట్లో మద్యపానం నిషేధిస్తామని చెప్పి కొన్నిమద్యంషాపులను తగ్గిస్తూ వచ్చింది. కానీ మద్యంమీద విపరీతమైన ఆదాయం వస్తుందని, మళ్లీ కొన్నిచోట్ల మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. ఇదే అదునుగా భావించిన కొంత మంది గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మద్యం షాపుల్లో చూస్తే చీప్ లిక్కర్ తప్ప మరో మద్యం దొరకడం కష్టమని, అదే బెల్టుషాపుల వారి దగ్గర అయితే కావాల్సిన మద్యం బ్రాండ్‌లు దొరుకుతున్నాయి. అంటే ప్రభుత్వ షాపుల్లో ఉండాల్సిన మద్యం బెల్టుషాపుల్లో ఉంటుంది. షాపుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు లంచాలకు అలవాటు పడి మద్యాన్ని పక్కదారి పటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల యువత పెడదారి పెడుతున్నారన్న సంకేతాలు లేకపోలేదు. ప్రభుత్వం మద్యం దుకాణాలు 10గంటల తర్వాత మూసివేసిన సందర్భంలో ఆదే బెల్టుషాపులు అర్థరాత్రి అయినా తలుపు తడితే రూ.70 నుంచి రూ.80 ఎక్కువ తీసుకుని ఏ బ్రాండ్ కావాలంటే అవి ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అర్ధరాత్రి వరకు తప్పతాగి గొడవలకు కారణాలు అవుతున్నారన్న అభియోగాలు లేకపోలేదు. దీనిపై ప్రభుత్వ అధికారులు కూడా చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. 18ఏళ్ల నుంచి 25ఏళ్ల వయస్సు గలవారు ఎక్కువగా మద్యం సేవిస్తూ తల్లిదండ్రులు మాటలు అగౌరవిస్తూ ఇష్టం వచ్చినట్లు అనేక వ్యసనాలకు బానిసైపోతున్నారు. బెల్టుషాపుల నిర్వహణదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఆర్వోల ఆకస్మిక తనిఖీలు

- ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పనితీరు పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో విధుల్లో ఉన్న ఫ్లైయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఆర్వోలు ఆకస్మికంగా ఆదివారం తనిఖీ చేశారు. పిఠాపురం అసెంబ్లీ నియోజవర్గ ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఎఫ్‌కేపాలెం, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, గొల్లప్రోలు మండలం గొల్లప్రోలు టోల్‌ప్లాజాల్లో విధుల్లో ఉన్న బృందాల పనితీరును పరిశీలించారు. కాకినాడ రూరల్ ఆర్వో కిషోర్ తిమ్మాపురం, అచ్చంపేట, గొడారిగుంటల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్స్ బృందాలతో కలిసి తనిఖీలు చేపట్టారు. కాకినాడ సిటీలో ఆర్వో వెంకటరావు పలు వార్డుల్లో బృందాలను తనిఖీ చేశారు. పెద్దాపురం ఆర్వో సీతారామారావు సామర్లకోట మున్సిపాలిటీలో, ప్రత్తిపాడు ఆర్వో శ్రీనివాసులు శంఖవరం మండలంలో కత్తిపూడి, ఏలేశ్వరంలో, జగ్గంపేట ఆర్వో ఎం.శ్రీనివాసరావు గండేపల్లి మండలంలో, తుని ఆర్వో తునిలో తనిఖీలు చేశారు. మారుతీకార్లు, ట్రాక్టర్లు, ఆటోలు ఇతర వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు, ఇతర తాయిలాల తరలింపుపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు.


పిఠాపురం నియోజకవర్గ పరిధిలో తనిఖీలు చేస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

మద్యం స్థానంలో బీరు

- గొల్లప్రోలులో ఎస్ఈబీ సిబ్బంది తనిఖీలు
- స్వాధీనం చేసుకున్న మద్యం స్థానంలో బీరు పెట్టిన వైనం
- కేసు తారుమారు చేసేందుకే అంటూ విమర్శలు
- అసలు వ్యక్తులను కేసు నుంచి తప్పించినట్లు ఆరోపణలు

గొల్లప్రోలు రూరల్, మార్చి 31: ఉన్నతాధికారులకు తెలియకుండా కింద స్థాయి సిబ్బంది తనిఖీలు నిర్వహించి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అసలు వ్యక్తులను తప్పించి కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వాధీనం చేసుకున్న మద్యం కాకుండా బెయిల్ వచ్చేలా బీరును అందులో ఉంచినట్లు సమాచారం.

గొల్లప్రోలు పట్టణంలోని మెయిన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన హెచ్‌సీ, కానిస్టేబుళ్లు తనిఖీలు జరిపి ముగ్గురు వ్యక్తులనుంచి 36 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాల్సి ఉండగా వారిని తప్పించి మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. మద్యం సీసాలను తప్పించి తొమ్మిది లీటర్ల బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు రికార్డుల్లో చూపి పిఠాపురం ఎస్ఈబీ స్టేషన్‌కు అప్పగించారు. దీంతో ఎస్ఈబీ పోలీసులు మైనం పద్మారావుపై కేసు నమోదు చేశారు. ఇందులో అసలు వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న మద్యాన్ని తప్పించడం వెలుగుచూసింది. కాకినాడ ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ ఈ తనిఖీలు చేశారని పిఠాపురం ఎస్ఈబీ సీఐ గురవయ్య చెప్తుండగా తాను తనిఖీలకు రాలేదని, తమ సిబ్బంది వచ్చారని ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు చెప్పడం గమనార్హం. మద్యం సీసాలు పట్టుబడినట్లు కేసు రాస్తే బెయిల్ రాదని ఉద్దేశ్యంతో వాటిని మార్చి బీరు సీసాలు ఉంచినట్లు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో పలు జరిగాయని సమాచారం.

మట్టి మాఫియాతో అధికారుల కుమ్మక్కు

- ముందస్తు సమాచారంతో గ్రావెల్ తవ్వకందారులు పరార్
- ఎక్స్‌కవేటర్, లారీలు తరలించేసిన వైనం
- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించి తవ్వకాల ప్రాంతాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారులు

గండేపల్లి, మార్చి 31: మట్టి మాఫియా, స్థానిక రెవెన్యూ అధికారులు కుమ్మక్కైపోయారు. రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన మట్టి మాఫియా కథనంపై జిల్లాఅధికారులు స్పందించారు. గండేపల్లి మండలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారన్న దానిపై అధికారులు ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. పైఅధికారులు తనిఖీకి వస్తున్నారని స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. వెంటనే అక్రమ గ్రావెల్ తవ్వకందారులకు ముందస్తు సమాచారాన్ని ఇచ్చారు. గ్రావెల్ తవ్వకందారులు అక్కడినుంచి ఎక్స్‌కవేటర్, లారీలు ఇతర సామాగ్రితో పరారయ్యారు. తీరా ఉన్నతాధికారులు వచ్చి చూసేసరికి ఆప్రాంతమంతా నిశబ్ధ వాతావరణంగా ఉంది. దీనిపై స్థానికాధికారులను అడిగితే తమకేమీ తెలియదన్నట్లు బదులివ్వడం గమనార్హం. దీన్నిబట్టి మట్టిమాఫియాతో అధికారుల అను బంధం ఎలాంటిదో తెలుస్తోంది. పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా స్థానిక అధికారులు తీరు మారడంలేదు. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించిన కొన్నిరోజుల్లోనే మళ్లీ తవ్వకాలు మొదలెట్టేస్తున్నారు. అక్రమార్కులనుంచి ఎప్పటికప్పుడు ముడుపులు తీసుకోవడంవల్లే అధికారులు నోరు మెదపడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సత్యదేవుడి ఆలయ పునర్నిర్మాణానికి
నేటితో పుష్కరకాలం పూర్తి

- నేడు ప్రత్యేక పూజలు, విశేష పదార్థాల నివేదన, పండిత సత్కారాలు
- 12ఏళ్లనాడు గ్రానైట్‌తో నిర్మాణం.. నేడు బంగారు ధ్వజస్తంభంతో ప్రత్యేక శోభ

లోవక్షేత్రంలో భక్తుల కోలాహలం - 5లో

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


శ్రీకృష్ణుడి చుట్టూ గోపికల నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 31: ఉగాది నందిఅవార్డులను పురస్కరించుకుని శ్రీసూర్యనృత్యనికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్థ 15వ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ సూర్యకళామందిరంలో ఆదివారం నిర్వహించిన నృత్యప్రదర్శనల్లో పెద్దసంఖ్యలో నృత్య కళాకారులు తమ ప్రతిభ చాటారు. గజానన, అదిగో.. అల్లదిగో తదితర గేయాలకు కళాకారులు నర్తించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీపీ మహాలక్ష్మి మాట్లాడుతూ 350మంది నృత్యకళాకారులకు ఉగాది నంది అవార్డులు ఇస్తున్నామన్నారు. ప్రతిఏడాది క్రమం తప్పకుండా నృత్య కళాకారులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. తమసంస్థ ద్వారా 15ఏళ్లుగా ఎంతోమందిని నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నృత్య కళాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

బురద జల్లే కుట్ర



- వలంటీర్లను తొలగించింది ఎన్నికల సంఘం
- కానీ టీడీపీపై ఆ నెపం నెట్టే ప్రయత్నం
- నేడు పింఛన్ పంపిణీ లేనట్టే..
- లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే కుట్ర
- 3 నుంచి 8 వరకు పంపిణీకి చర్యలు
- సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలట?
- ఆధార్ కార్డు తెస్తేనే పింఛన్

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి) పింఛనుదారులు ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతున్నట్టు అనుమానాలు వస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీన వారికి పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలిసిందే. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి తీసుకుని వెళ్లి సొమ్ములు అందించేవారు. నడవలేని వారు, డయాలసిస్, పెరాలసిస్, హెచ్ఐవీ బాధితులకు కూడా ఇంటికి తీసుకుని వెళ్లి ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల విధులను అధికార వైసీపీ దుర్వినియోగం చేస్తుండడంతో, ఎలక్షన్ కమిషన్ వారిని విధుల నుంచి దూరం పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్ర షాక్‌కు గురైన వైసీపీ నేతలు.. పింఛనుదారులకు సకాలంలో పింఛన్లు వెళ్లకుండా చేసి, ఇబ్బంది పెట్టి, దీనికి కారణం తెలుగుదేశం, దాని మిత్రపక్షాల వైఖరి అని చెప్పడానికి తెగతంటాలు పడుతోంది. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు ముందుగా మేల్కొని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ, 1వ తేదీనే లబ్ధిదార్లకు పింఛను అందజేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవచ్చు. అందుకు సచివాలయ సిబ్బంది కావలసినంత మంది ఉన్నారు. వారితో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తే ఒక రోజులోనే పంపిణీ చేయవచ్చు. కానీ వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఆపేయడంతో, పెన్షన్లు ఆలస్యం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మీదకు తోసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 2.45 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. ఇందులో 18 రకాల లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ నెలకు రూ.75 కోట్లు పంపిణీ చేయవలసి ఉంది. వృద్ధులు, చేనేత, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, కిడ్నీ బాధితులు, హెచ్ఐవీ బాధితులు, చర్మకారులు ఉన్నారు. ఇంకా అమరావతికి భూములు ఇచ్చిన రైతుల పింఛను కూడా ఉంది. అమరావతికి భూములిచ్చిన వారిలో ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు ఉండడం గమనార్హం. వారు పేదలు కావడంతో నెలకు పింఛను వస్తోంది. ఇక హిజ్రాలకూ పింఛన్ ఉంది.

సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ నెలలో సామాజిక భద్రత పెన్షన్లు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలోని పింఛనుదారులంతా తమ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సిబ్బంది ద్వారా పెన్షన్లు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పెన్షన్ పాసు పుస్తకం తీసుకుని వెళ్లాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ సచివాలయాల వద్దే పింఛన్లు తీసుకునేటట్టు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



ఇంటింటికీ ఇవ్వరు..

విధులు దుర్వినియోగం కాకుండా ఎన్నికల విధులకు వలంటీర్లను ఈసీ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. శనివారమే ఈసీ ఈ నిర్ణయం ప్రకటించినా, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయింది. దీని వెనుక దురుద్దేశం ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. పింఛనుదారులు ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు పనివేళల్లో వెళ్లాలని, ఆధార్‌కార్డు వెంట తీసుకుని వెళ్లాలని సమాచారం ఇచ్చింది. ఈ విషయం ఇంకా లబ్ధిదార్లకు పూర్తిగా చేరే అవకాశం లేదు. సోమవారం ఉదయం పింఛన్ల కోసం లక్షల మంది ఎదురు చూస్తుంటారు. కానీ పింఛన్ పంపిణీ మూడో తేదీ నుంచి మొదలు కానుంది. సచివాలయాల్లో ఎంతమంది ఉద్యోగులుంటే అన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ వృద్ధులు సచివాలయాలకు నడిచి రాగలరా, అందరికీ ఓపిక ఉంటుందా? అసలు మంచం మీద నుంచి నడవలేనివారు కూడా ఉంటారు. అంతేకాక కిడ్నీ బాధతో డయాలసిస్ చేసుకునే వారు, పెరాలిసిస్ బాధితులు, హెచ్ఐవీ బాధితులు కూడా ఉన్నారు. వీరంతా సచివాలయాలకు ఎలా వెళ్లగలరు? గతంలో మంచం మీద నుంచి కదలలేని ముసలివారికి కూడా దగ్గరకు వెళ్లి, పింఛన్లు అందజేసినట్టు గొప్పగా ప్రచారం చేసుకున్న నేతలకు ఈసారి ఇబ్బంది పెట్టడం తప్పనిపించడం లేదా? ఒక్కో సచివాలయంలో 8 మంది నుంచి 11 మంది వరకూ ఉద్యోగులు ఉంటారు. వారందరికీ పురమాయించి, ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయమంటే చేయలేరా.. సచివాలయ వ్యవస్థ గురించి గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం, వారితో ఇంటింటా సర్వేలు వంటి అనేక పనులు చేయించిన ప్రభుత్వం వారిచేత ఇంటికే పింఛన్లు పంపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు కోరుతున్నారు.

3 నుంచే పంపిణీ

లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ ఇస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం ఏప్రిల్ 1న అంటే సోమవారం పంపిణీ చేయడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు వంటి కారణాలు చూపుతూ, ఆదివారం బ్యాంక్‌లు పనిచేసినప్పటికీ లబ్ధిదార్లకు డబ్బులు ఇవ్వడానికి ఇప్పటివరకూ బ్యాంక్‌లలో డబ్బులు జమ చేయలేదు. 3నుంచి 8వ తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

దుష్ప్రచారం

వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేసి, అంతా జగనే ఇస్తున్నాడని, ఆయనకే ఓటు వేయాలని చెప్పించుకుంటున్న వైసీపీకి ఈసీ నిర్ణయం మింగుడు పడడం లేదు. ఇతర ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసి, జగన్ గురించి చెప్పరేమోననే ఆందోళన మొదలైంది. లబ్ధిదార్లంతా దూరమైపోతారేమోనని భయం పట్టుకుంది. పైగా చంద్రబాబు ఇప్పటికే తన ఎన్నికల మేనిఫెస్టోలో నెలకు రూ.4 వేల పింఛను సొమ్ము ఇస్తామని, ఇంటికే పంపిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి పింఛన్‌దారులు ఆకర్షితులవుతారేమోననే భయం వైసీపీకి పట్టుకుంది. ఏప్రిల్ నెలలోను, పోలింగ్‌కు ముందు మే నెలలోనూ పింఛన్ల ఆలస్యం చేసి, తెలుగుదేశం, దాని మిత్రపక్షాల విధానాల వల్లే పింఛన్లు పంపిణీ ఆలస్యమైందని చెప్పి, లబ్ధి పొందాలనే కుయుక్తులు పన్నుతోంది. వృద్ధులు, వివిధ రకాల ఇబ్బందులు, సమస్యలతో ఉన్న పింఛన్‌దారులను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిది కాదనే వాదన మొదలైంది. 1వ తేదీనే పింఛన్ సొమ్ము ఇవ్వాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇతర ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

ఫోన్లు ఇంకా వలంటీర్ల వద్దనే..

వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఈసీ ఆదేశించినా జిల్లాలో ఇంకా అందరి నుంచి ఫోన్లు తీసుకోలేదు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం కొందరి నుంచి ఫోన్లు తీసుకున్నామని, సోమవారం నాటికి పూర్తిగా తీసేసుకుంటామని చెబుతున్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఈప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.



కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పవన్

దైవారాధనలో..

పిఠాపురంలో పలు ప్రసిద్ధి ఆలయాలను దర్శించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో కొబ్బరికాయల ముడుపు

పిఠాపురం, మార్చి 31: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సందర్శించారు. పాదగయలో కొలువై ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారిని దర్శించుకున్నారు. శక్తి పీఠం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అష్టోత్తర కుంకుమార్చన చేసి అమ్మవారికి పట్టుచీర సమర్పించారు. శ్రీచక్రాన్ని తాకి కుంకుమ పూజలో పాల్గొన్నారు. మొదటగా విఘ్నేశ్వరుని పూజించుకుని, స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహించారు. ఔదంబర వృక్షానికి పూజలు చేశారు. అక్కడ నుంచి స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవిని దర్శించి పూజలు చేశారు. పురుహూతికా శక్తి మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలికి అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు

దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థలిగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని పవన్ సందర్శించారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. పవన్ పేరుపై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయ ముడుపు కట్టి మొక్కారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు అందజేశారు. ఆలయాలను పవన్‌కల్యాణ్ సంప్రదాయ దుస్తుల్లో దర్శించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ వెంట కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

జనసేన ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

పిఠాపురం సమన్వయ బాధ్యతలు మర్రెడ్డికి

పిఠాపురం, మార్చి 31: జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ కమిటీలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, జాతీయ మీడియా పార్టీ అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి కె.శరత్‌కుమార్ సభ్యులుగా ఉంటారు. పిఠాపురం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను మర్రెడ్డి శ్రీనివాస్‌కు అప్పగించారు. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో పార్టీ సమాయత్తం కావడం, సమన్వయం, ప్రచారాలు, పోల్, బూత్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ సభ్యులతో ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు.

ఊట కాలువలో పడి లారీ డ్రైవర్ దుర్మరణం

అనపర్తి, మార్చి 31 : అనపర్తి నుంచి అర్తమూరు వెళ్లే నల్లకాలువ గట్టున పిరమిడ్ కేంద్రం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో ఆదివారం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అనపర్తి మండలం పొలమూరుకు చెందిన మల్లిడి నర్సిరెడ్డి(36)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు చెప్పారు. ఈ మేరకు నర్సిరెడ్డి సోదరుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ద్వారపూడికి చెందిన లారీపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని రెండు రోజుల కిందట డ్రైవింగ్ పనిపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడన్నారు. మద్యం మత్తులో ఊట కాలువలో పడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణానికి పుష్కర కాలం

నేడు ప్రత్యేక పూజలు, విశేష పదార్థాల నివేదన, పండిత సత్కారాలు



అన్నవరం, మార్చి 31: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ పునఃనిర్మాణం పూర్తయి సోమవారానికి 12 సంవత్సరాలు పూర్తైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేషపదార్థాల నివేదన, పండిత సత్కారాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సత్యదేవుడి ఆలయం 1891 ఖర నామ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించినట్లు ఆలయ చరిత్రను బట్టి తెలుస్తుంది. పూరిపాకలో మూలవరులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దరిమిలా 1933-34లో ఆలయాన్ని నిర్మించారు. 1970 వ దశకంలో ఆలయంపై పిడుగు పడడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో 2011 ఫిబ్రవరి నెలలో దేవదాయ కమిషనర్ ఆదేశాలతో అప్పటి ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమిళనాడు నమ్మక్కల్ నుంచి తెప్పించిన గ్రానైట్‌తో ఈ నిర్మాణం చేయించారు. మూలవరులను కదపకుండా స్వామి, అమ్మవార్లకు త్రికాలార్చనలు, నివేదనలు చేయించేవారు. మూలవరుల దర్శనం భక్తులకు లేకపోవడంతో అనివేటి మండపంలో బాలాలయం ఏర్పాటు చేసి సుమారు ఏడాది పాటు భక్తులకు ఉత్సవమూర్తుల దర్శనం కల్పించారు. ఈ సమయంలో మూలవరులకు ఉన్న శక్తిని అంతా కళశాలలో పండితులు ఆవహింపచేసి బాలాలయంలో ఉత్సవమూర్తుల చెంతన ఉంచడంతో భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గకుండా దినదిన ప్రవర్థమానం చెందేలా ఆలయం ఖ్యాతినార్జించింది. ఆలయ పునఃనిర్మాణ విషయంలో పలు విమర్శలు వచ్చినా వాటిని లెక్కచేయకుండా ఈవో రామచంద్రమోహన్ మొక్కవోని దీక్షతో ఏడాదిలో ఆలయ నిర్మాణం గ్రానైట్‌తో పూర్తిచేసి విమర్శకుల నోళ్లు మూయించారు. 2012 మార్చి 14న (ఫాల్గుణ బహుళ సప్తమి) రోజున నూతన ఆలయం శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి చేతులమీదుగా జరిపించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు చేపడుతున్నారు. అప్పట్లో ఈవో ముందుచూపుతో ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ఉద్దేశ్యంతో ఇటుకతో నిర్మించారు. ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ప్రతిపాదనను తాజాగా రామచంద్రమోహన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే దీనిపై మౌఖిక ఆదేశాలు రాగా ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రకటన ఆలస్యంగా వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న స్వామివారి వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సహాయంతో బంగారు ధ్వజస్తంభం రూపుదిద్దుకోనుంది. సుమారు రూ.4 కోట్లు వ్యయంతో నెల్లూరుకు చెందిన దాత దీనిని చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రత్యేక పూజలు అనంతరం 22న బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణం తన చేతులమీదుగా జరగడం, తిరిగి పుష్కరకాలం పూర్తి వేడుకలు, బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కూడా తాను ఇక్కడ ఉన్నప్పుడే చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ గోపురం బంగారు తాపడం పనులకు త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

వేగుళ్లను గెలిపించండి

లీలాకృష్ణతో పవన్



మండపేట, మార్చి 31: కాకినాడ జిల్లా పిఠాపురం పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు మండపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదివారం పిఠాపురం వెళ్లి పవన్‌తో సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని లీలాకృష్ణను పవన్ కోరారు. కూటమి అధికారంలోకి రాగానే సముచిత స్థానం ఉంటుందని లీలాకృష్ణకు పవన్ భరోసా ఇచ్చారు. త్వరలో మండపేటలో ఎన్నికల ప్రచారానికి వస్తానని పవన్ వారికి సూచించారు. ఇద్దరు నేతలు కలిసి గెలుపే లక్ష్యంగా, వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలని పవన్ కోరారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి విజయం కోసం పనిచేస్తానని లీలాకృష్ణ చెపినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల చెప్పారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, మార్చి 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొప్పూరి శివశంకరరెడ్డి-పద్మ దంపతులు రూ.5,00,117 విరాళం సమర్పించారు. దాత కుటుంబీకులకు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.3,35,840 లభించినట్టు ఈవో తెలిపారు.

బాలుడి హత్య కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

ఎటపాక, మార్చి 31: ఓ బాలుడు హత్య కేసులో ముగ్గురు బాలురను అరెస్టు చేసినట్లు సీఐ డి.రామారావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకర్లకు వివరాలు అందించారు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు బాలురు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. అల్లరిచిల్లరిగా తిరుగుతున్నారు. ఈ నెల 25న వెంకటేశ్వరస్వామి కల్యాణం రోజున ఆలయం సమీపంలో జామాయిల్ తోటలో ఆ ఆరుగురు గంజాయి మత్తులో భోజనం చేస్తుండగా అదే సమయంలో వెంకటరెడ్డిపేటకు చెందిన ఓ బాలుడు ఆ వైపు మలవిసర్జనకు వెళ్లాడు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు వాటర్ బాటిల్‌తో వెళ్తున్న ఆ యువకుడిని తిట్టి, కొట్టారు. దీంతో ఆ బాలుడు తన ఇద్దరి స్నేహితులతో అక్కడకు రాగా, రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాంగోపాలపురానికి చెందిన బాలుడు అజ్మీర సాయికుమార్‌ను కత్తులతో పొడిచారు. ఆ బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. నిందితుల కోసం గాలించగా, ఆదివారం బొజ్జిగుప్ప గ్రామ శివారులోని రాయిగూడెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితులు గంజాయికి బానిసైనట్లు పోలీసులు తెలిపారు. జేబుల్లో కత్తులు పెట్టుకుని భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో జనసంచారం లేని చోట ఒంటరిగా ప్రయాణిస్తున్న వారిని ఆపి కత్తులతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ కె.పార్థసారథి, సిబ్బందిని ఎస్పీ అభినందినట్లు సీఐ తెలిపారు.

లోవ దేవస్థానం కిటకిట



ఆరుబయట వంటలు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మార్చి31: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా కనిపించింది. అమ్మవారి దర్శనార్థం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.3.9 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

'తిరుమల'లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సదస్సు



మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 31: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. జేఈఈ (మెయిన్స్, అడ్వాన్స్), నీట్ పరీక్షల్లో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ నున్న సరోజనిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్ లత, ఎం.రామకృష్ణ, జీవీ శాస్త్రి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం,మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి-కడియం రైల్వే స్టేషన్ల నడుమ రైలు పట్టాల పక్కన ఉన్న ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు హెచ్‌సీ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఏదొక రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. ఒంటిపై నీలం, సిమెంటు రంగు టీ షర్టు, నీలం రంగు జీన్సు ప్యాంటు ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.9491444022కి సమాచారం అందించాలని కోరారు.

జలపాతంలో పడి యువకుడి మృతి





మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం పొల్లూరు జలపాతంలో పడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు మేరకు తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలంలోని కోటపాడు, సింగంపల్లి గ్రామాలకు చెందిన 25 మంది యువకులు చింతూరు సమీపంలోని పొల్లూరు జలపాతానికి ఆదివారం ట్రావెల్ బస్సులో వచ్చారు. వీరందరూ లిక్కర్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సింగంపల్లి గ్రామానికి చెందిన వై.కొండయ్య(33)ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడ్డాడు. అది గమనించిన తోటి స్నేహితులు కొండయ్యను జలపాతం నుంచి ఒడ్డుకు చేర్చి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కొండయ్య మృతి చెందాడనే వార్త జీర్ణించుకోలేక స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జిత రథసేవకు స్పందన

అన్నవరం, మార్చి 31: సత్యదేవుడి సన్నిధిలో నూతన ఆర్జితసేవగా ప్రవేశపెట్టిన రథసేవకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి ఆదివారం ఈ రథసేవను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆదివారం రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు ఆలయ పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథసేవ ప్రారంభించారు. నూతన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్ద నుంచి పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రథసేవలో పాల్గొనే భక్తులకు స్వామివారి కండువా, రవికుల వస్త్రం, గోత్రనామాలతో పూజలు, నలుగురికి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం తదితర సౌకర్యాలు కల్పించడంతో భక్తులు పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈసేవకు విశేష ప్రచారం కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.

బైక్ అదుపుతప్పి ఐస్‌క్రీం వ్యాపారి మృతి

మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం గొడ్లగూడెం-లక్కవరం జంక్షన్ మధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఐస్‌క్రీం వ్యాపారి మృతి చెందాడు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం గోకవరం మండలం తిరుమలపాలెం గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు(45) కుటుంబ పోషణ నిమిత్తం ఐస్‌క్రీంలు విక్రయిస్తుంటాడు. చింతూరు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం మోతుగూడెంలో ఐస్‌క్రీంలను విక్రయించిన తర్వాత చింతూరు వెళ్తుండగా గొడ్లగూడెం- లక్కవరం జంక్షన్ మధ్యలో అదుపు తప్పి కింద పడి మృతిచెందాడు.



రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి

అన్నవరం, మార్చి 31: అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ప్రయాణికులు, స్టేషన్ సిబ్బంది సమాచారంతో రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, హెచ్‌సీ శ్యామ్ మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. కాఫీ కలర్ చుడీదార్ శరీరంపై ఉంది. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

‘టీడీపీ బీసీ డిక్లరేషన్‌తో మేలు’

సామర్లకోట, మార్చి 31: టీడీపీ అమలు జరుపనున్న బీసీ డిక్లరేషన్ రాష్ట్రంలో బీసీలందరికీ ఎంతగానో మేలు చేకూర్చే విధంగా టీడీపీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు రూపొందించారని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పేర్కొన్నారు. ఆదివారం సామర్లకోటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం కార్పొరేషన్‌కు నిధులు,విరివిగా స్వయం ఉపాధి రుణాలు ఉంటాయని తెలిపారు.



జనసేనలో చేరిన కొవ్వూరు గ్రామస్థులతో పంతం నానాజీ

రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమే : నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 31: సీఎం జగన్ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రజాశీస్సులతో అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. వలసపాకల గంగరాజునగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కరెడ్ల గోవిందు ఆధ్వర్యంలో కొవ్వూరు, తారకరామనర్‌కు చెందిన వైసీపీకి చెందిన సుమారు 100 మంది తూరంగి నుంచి అగ్నికుల క్షత్రియ యూత్ అసోసియేషన్ నుంచి పలువురు పార్టీలో చేరారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్ నుంచి పార్టీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి తాటికాయల వీరబాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా, వారికి పంతం నానాజీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్ర ప్రజలకు, పార్టీలకు ఎంతో కీలకమన్నారు. ఒక్క సారంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రజాకంటక పాలన సాగించి, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. అధికార పార్టీ ప్రలోభాలను అడ్డుకుని, స్వేచ్ఛగా ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లేసేలా కృషి చేయాలని కోరారు. గ్లాస్ గుర్తు కోసం క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

‘కూటమితోనే బీసీలకు న్యాయం’



సిరిపురంలో మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న సత్యప్రభ, రామ్‌కుమార్

ఏలేశ్వరం, మార్చి 31: ఎన్‌డీఏ కూటమితో బీసీలకు న్యాయం చేకూరుతుందని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో జయహో బీసీ సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సత్యప్రభ, రామ్‌కుమార్ మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడిన పార్టీ టీడీపీ అని సత్యప్రభ అన్నారు. సత్యప్రభను గెలిపించే విధంగా బీసీ నాయకులంతా క్షేత్రస్థాయిలో పర్యటన చేసి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ఐక్యమత్యంగా పనిచేయాలని రామకుమార్ కోరారు. సిరిపురం మాజీ ఎంపీటీసీ కాళ్ళ నూకరత్నం ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరగా వారికి సత్యప్రభ కండువాలు కపి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలో కూటమి శ్రేణులు ఇంటింటికీ తిరిగి కూటమి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మేనిఫెస్టోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనేకుల వీరభద్రరావు, అలమండ చలమయ్య, వి.మంగ, మూర్తు బాస్ కోరాడ కృష్ణమోహన్, బుగతా శ్రీను, ధనేకుల అధృష్ట దేవుడు, చల్లా గణేష్, సంగన ప్రభుజీ, ధనేకుల రామకృష్ణ, కొల్లా శ్రీనివాస్, సామంతుల గోపి, నూతి బూరయ్య, బెల్లాని శ్రీను పాల్గొన్నారు.

అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి : కొండబాబు



ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 31: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని, అల్లా ఆశీస్సులు నగర ప్రజలందరిపై ఉండాలని కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా రామకృష్ణారావుపేట కొత్తూరు మదీనా మశీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రార్థనలు చేశారు. కొండబాబు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో అత్యంత కఠోరమైన ఉపవాసాన్ని పాటిస్తూ భగవంతుని సేవలో ఉండడం అల్లా గొప్ప శక్తి వల్లే సాధ్యమన్నారు. మశీదు కమిటీ అధ్యక్షుడు కుతుబుద్దీన్, కమిటీ సభ్యులు కొండబాబును శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మశీదు కమిటీ సభ్యులు సయ్యద్, బాక్సర్, కాజా, డాక్టర్ బాబు, సిరాజుద్దీన్, టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్‌కే బాబులు ఎంఏ తాజుద్దీన్, ఎస్‌కే రహీమ్, ఎండీ సయ్యద్, ఎండీ అన్సర్, అశ్రిన్ అలీ, కరిముల్లా తదితరులున్నారు.

‘ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం’



ప్రజలను పలకరిస్తున్న యనమల దివ్య

తొండంగి, మార్చి 31: వైసీపీ ప్రభుత్వంపై విసిగెత్తిన్న ప్రజలు టీడీపీ కూటమిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎదురుచూస్తున్నారని తుని అభ్యర్థి యనమల దివ్య అన్నారు. ఆదివారం బెండపూడి శివారు సుబ్బరాయపురంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రానున్నది ఉమ్మడి ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సమస్యలన్నీ పరిష్కరించి ఆదర్శ పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, చొక్కా అప్పారావు, బెండపూడి నాయుడు, వెలుగుల గోపాలకృష్ణ, కోడ వెంకట రమణ, సాధనాల నూకరాజు, బుసాల శ్రీను, పాలచర్ల ఏర్రబ్బు, బంటుపల్లి అన్వేష్ పాల్గొన్నారు.

పొన్నాడలో పవన్ పర్యటన రద్దు

కొత్తపల్లి, మార్చి 31: ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి విచ్చేసిన జనసేనాధిపతి పవన్ కల్యాణ్ ఆదివారం పొన్నాడలో బషీర్ బీబీ అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేస్తున్నట్టు జనసేన, టీడీపీ పార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దీంతో వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మత్స్యకారులు పొన్నాడ బషీర్ బీబీ ఆలయం వద్దకు విచ్చేశారు. పిఠాపురం పర్యటనలో పవన్ ఉండగా తీవ్ర గొంతి నొప్పి రావడంతో డాక్టర్ల సూచనల మేరకు పొన్నాడ పర్యటనను రద్దు చేసుకున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండను సైతం లెక్కచేయకుండా పడిగాపులు కాసిన ప్రజలు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

‘అవినీతి నిర్మూలనే లక్ష్యం’

ప్రత్తిపాడు, మార్చి 31: అవినీతి నిర్మూలనే లక్ష్యంగా ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు యునైటెడ్ మానవహక్కుల ప్రొటెక్టర్స్ కౌన్సిల్ జాతీయ లీగల్ కార్యదర్శి, స్థానిక న్యాయవాది పిల్లి బలరాముడు చెప్పారు. మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి, ధర్మవరం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి గడపగడపకు కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ సంక్షేమ అభివృద్ధి నిధులు ఆరునెలలుకొకసారి బహిరంగ పరుస్తామని.. స్థానిక యువత, మహిళలు, విద్యావంతుల భాగస్వామ్యంతో నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

ప్రత్తిపాడు, మార్చి 31: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు)ను ఆదివారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించి అభినందించారు. ఆ పదవి లభించడాన్ని పురస్కరించడాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మురళీరాజును శాలువా కప్పి సన్మానించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మురళీరాజు అభిమానులు, కార్యకర్తలు ధర్మవరం విచ్చేసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

కౌంటింగ్ కేంద్రాల సందర్శన



కౌంటింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 31: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. జేఎన్‌టీయూకే సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల డీటీ సీతాపతిరావు ఉన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
సమాధుల వద్ద అలంకరణలు



పెద్దాపురంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు



పిఠాపురంలో సమాధిని అలంకరించిన క్రైస్తవులు



సామర్లకోట మండలం పనసపాడులో సందేశం వింటున్న క్రైస్తవులు

పెద్దాపురం, మార్చి 31: ఈస్టర్ వేడుకలను పట్టణ, మండల గ్రామాల్లో ఆదివారం క్రైస్తవ విశ్వాసులు ఆనందోత్సాహాల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనా మందిరాలు విశ్వాసులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే తమ పూర్వీకుల సమాధుల వద్దకు చేరుకుని వారి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రైస్తవ సోదరులు ప్రభువును స్తుతిస్తూ ప్రార్థనా గీతాలు ఆలపించారు.

ఏలేశ్వరం: పట్టణంలో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. కాలేజ్ రోడ్డులో సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్ మిషన్, ఆగ్లీలియం చర్చ్ పాస్టర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆరాధన నిర్వహించారు. క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను అలంకరించి కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ శిలువలో ప్రాణత్యాగం చేసిన ఏసుక్రీస్తు మూడో రోజు సమాధినుంచి సజీవంగా లేచిన దినాన్ని ఈస్టర్ పండుగగా చేసుకుంటారన్నారు. శాంతి సుధ, జ్యోతి, పేకల జాన్, శేఖర్ క్రైస్తవ పెద్దలు తదితరులున్నారు.

సామర్లకోట: సామర్లకోటలో జాన్ మోజెస్, బీఎస్.వందనం ఆధ్వర్యంలో సమాధుల వద్ద ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు. పిఠాపురం రోడ్డులో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ మత గురువులు ఎస్.శామ్యూల్ రాజ్, బి.కిరణ్‌కుమార్, బి.బాబూరావు, ఎం.సాగర్, దవులూరి దొరబాబు, దవులూరి సుబ్బారావు తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు. సామర్లకోట మండలం పనసపాడు పల్లపువీధి యెహోవాయీరే ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తును పునరుద్ధానుడై లేచి పరలోకానికి ఆరోహణమైన ఘట్టాన్ని పాస్టర్ ఎన్.ప్రభుదాస్ వివరించారు. క్రీస్తును ఆరాధిస్తూ కీర్తనలు చేశారు. సంఘస్తులు నిర్వహించిన ఆత్మీయవిందులో యాదిద్య ఛాయా, ఏంజెల్, పలువురు పాల్గొన్నారు.

పిఠాపురం/పిఠాపురం రూరల్: పిఠాపురం పట్టణం, మండలపరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే పూర్వీకుల సమాధులను సందర్శించి వాటిని అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి, బెతెస్థ బాప్టిస్టు చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. చిత్రాడలో ఈస్టర్ నిర్వహించారు.

గండేపల్లి: మండలంలో జెడ్.రాగంపేటలో పాస్టర్ లాజరస్ శామ్యూల్, సురేంద్రకుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించారు. పలువురు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కిర్లంపూడి: మండల గ్రామాల్లోని శ్మశానవాటికల్లో క్రైస్తవులు తమ బంధువుల సమాధులను శుభ్రపరిచి పువ్వులు జల్లి కొవ్వొత్తులు వెలిగించి స్మరించుకున్నారు. చిల్లంగి గ్రామానికి చెందిన చెప్పుల వెంకటరత్నం మెమోరియల్ బాప్టిస్టు చర్చి మందిరంలో పాస్టర్ రెవరెండ్ చెప్పుల జ్యోతిబాబు, పాస్టర్ స్టీవెన్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు జరిపారు. చెప్పుల బుచ్చమ్మ, రత్నరాజు, రోజారాణి, అనిత పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలో ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మరణ భయం నుంచి మానవుడిని విడిపించడానికి ఏసుప్రభువు పునరుద్ధానుడు అయ్యాడని పాస్టర్లు తెలిపారు. ధర్మవరంలో బిలివర్స్ బాప్టిస్ట్ చర్చి రెవరెండ్ ఫాదర్ ఊబా కృపావర్ ఆధ్వర్యంలో.. ప్రత్తిపాడు సెయింట్ జోసెఫ్ చర్చి, ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

సర్పవరం జంక్షన్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట శివారు ఏపీఐఐసీ కాలనీలో ఈస్టర్‌ను నిర్వహించారు. డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే రోజున శిలువ వేయబడిన మూడు రోజుల అనంతరం ఏసు మరణాన్ని జయించి తిరిగి లేచివచ్చిన రోజు ఈస్టర్ అన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు చింతపల్లి సుబ్బారావు, శ్రీవాణి, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



సామర్లకోట: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాజప్ప

సామర్లకోట, మార్చి 31: సామర్లకోటలో ఆదివారం ప్రముఖ మోటార్‌ఫీల్డ్ వ్యాపారి కోటిపల్లి శ్రీను, కోటిపల్లి శశికాంత్‌లతో బాటూ మరో 100 మంది వైసీపీ అనుచరులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్, తదితర పట్టణ టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో బడేలమ్మ చెరువు సమీపాన యార్లగడ్డ చిన్నీ ప్రాంగణంలో భారీ వేదికను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప హాజరై కోటిపల్లి శ్రీను, శశికాంత్ తదితరులకు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో జనసేన పెద్దాపురం ఇంచార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి విత్తనాల వెంకటరమణ, రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు.



కాజులూరు: టీడీపీలో చేరినవారితో సుభాష్

జగ్గంపేటలో...

జగ్గంపేట, మార్చి 31: జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో వైసీపీ యువ నేత నాగిరెడ్డి సత్యసాయి కృష్ణ ఆ పార్టీకి రాజీనామా చేసి తెల్లా ప్రగడ మణికుమార్, నూకరాజు, పసగడ్డ రమేష్, కర్ర వెంకటరాజు, సతీష్, కోటి, ఏసు, ఆనంద్, చిన్ని, జయబాబు తదితర అనుచరులు 30 కుటుంబాలతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, కందుల వీరబాబాబు, బొండా రాజేష్, నాగిరెడ్డి బాస్కరరావు, నేదురి గణేష్, వేములకొండ జోగారావు, నాగిరెడ్డి అనిల్‌కుమార్, జీను పెద్దరాంబాబు, పలివెల ఏసురాజు, నాగిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుగ్గుదూరులో...

కాజులూరు: కాజులూరు మండలం దుగ్గుదూరులో దళిత నాయకుడు రంపాల రాజు, ఉమ, సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, జ్యోతికుమార్, మాజీ ఎంపీటీసీ తాతపూడి కుమారి, జాన్‌లతో పాటు సుమారు 300 మంది దళిత సోదరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రామచంద్రపురం కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దళిత నాయకులు మాతా స్వామి, పోతురాజు బీమారావు, జల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, రామచంద్రపురం బీజేపీ ఇన్‌చార్జ్ దూడల శంకరనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జీ, జనసేన మండలాధ్యక్షుడు బొండా వెంకన్న, కురుపూడి కొండ ఉన్నారు.

సూరంపాలెంలో...

గండేపల్లి: మండలంలో సూరంపాలెం సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని జగ్గంపేట ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. నెహ్రూ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాకినాడలో...

కాకినాడ సిటీ: స్థానిక 10వ డివిజన్‌కు చెందిన బొడ్డు శివ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు స్థానిక జగన్నాథపురంలోని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం వద్ద టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. బొడ్డు శివ, కుంది దానయ్య, వాసుపల్లి తాతారావు, నూరాడ ఆశీర్వాదం, కొంగ్రు వీరబాబు, అర్జుల శ్రీను, వాసుపల్లి సతీష్, మారుపిల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం





జగ్గంపేటలో ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న నెహ్రూ, పెద్దాపురం ప్రచారంలో చినరాజప్ప

జగ్గంపేట, మార్చి 31: టీడీపీ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో జగ్గంపేట నియోజకవర్గంలోని టీడీపీ దళిత నేతలు ప్రత్యేక వాహనంలో బయలుదేరి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూను గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో దళిత గళం పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ వాహనాన్ని నెహ్రూ జెండా ఊపి ప్రారంభించారు. జగ్గంపేటకు చెందిన సొంబత్తుల చంద్రశేఖర్, బూరుపూడి గ్రామానికి చెందిన మోర సత్తిబాబు, పలువురు దళిత నాయకులు దళిత కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పలు కుటుంబాలను కలవడంతో పాటు టవర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో దళిత నేతలు, టీడీపీ, జనసేన, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట టీడీపీ కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనంలో నియోజకవర్గంలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించేందుకు ప్రత్యేక వాహనంలో బయలుదేరిన టీడీపీ యువత బృందం ప్రత్యేక వాహనాన్ని నెహ్రూ జెండా ఊపి ప్రారంభించారు.

గండేపల్లి: జగ్గంపేట టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మండలంలో సూరంపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, కుంచే రాజా,కందుల చిట్టిబాబు, పోసిన బాబురావు, దుర్గప్రసాద్‌యాదవ్ తదితరులున్నారు.

కిర్లంపూడి: చిల్లంగి గ్రామంలో కాళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత, సర్వారాయుడు ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తోట రవి, తోట గాంధీ, చదరం చంటిబాబు, వీరంరెడ్డి కాశీబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, గుడాల రాంబాబు పాల్గొన్నారు.

పెద్దాపురం: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండల పరిధిలోని తూర్పుపాకలు గ్రామంలో ఆదివారం జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ నేత విత్తనాల వెంకటరమణతో కలిసి ప్రచారం చేపట్టారు. రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి దూరమైపోయిందన్నారు. ఇప్పటికే వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. అలాగే బి.తాటిపర్తి గ్రామంలో సుమారు 50 మంది రాజప్ప సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, కొత్తిం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నాని, చాగంటి గోపాలకృష్ణ, పేరుపురెడ్డి చంద్రశేఖర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కరప: వచ్చే ఎన్నికల్లో వైసీపీ దుర్మార్గ పాలనను అంతమొందించి కూటమి విజయానికి సహకరించాలని కాకినాడ రూరల్ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ కోరారు. కరప మండలం వాకాడ గ్రామంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, కాకినాడ రూరల్ కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబి), జనసేన, టీడీపీ మండలాధ్యక్షులు బండారు మురళి, దేవు వెంకన్న, డాక్టర్ బొండా సూర్యారావు, రెడ్డిపల్లి భాస్కర్, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, దూడల నారాయుడు, గట్టి రవి తదితరులున్నారు.

గొర్రిపూడిలో వైసీపీ నాయకుడి బరితెగింపు

జనసేన నాయకులను బలవంతంగా వైసీపీలోకి చేర్చే ప్రయత్నం

కరప, మార్చి 31: ఒక వైసీపీ నాయకుడు బరితెగించి తమ పార్టీలోకి బలవంతంగా చేర్చుకునే ప్రయత్నం చేసి అబాసుపాలయ్యాడు. వివరాల్లోకి వెళితే...కరప మండలం గొర్రిపూడిలో ఆదివారం ఉదయం రజక సంఘం పెద్దల వార్షిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమయంలో గ్రామ ఉపసర్పంచ్, వైసీపీ నాయకుడు చీకాల సుబ్బారావు, మరికొంత మంది అక్కడకు వెళ్లి తిరిగి అధికారంలోకి వస్తే అవి చేస్తాం..ఇవి చేస్తామంటూ బూటకపు హామీలు ఇచ్చారు. అక్కడ కూర్చున్న 2వ వార్డు సభ్యుడు, జనసేన నాయకుడు ఖండవల్లి గోవిందు, మరికొంత మందికి ఇష్టం లేకపోయినా వైసీపీ కండువాలు కప్పి ఫొటోలు తీశారు. విషయం తెలిసిన స్థానిక జనసేన నాయకులు అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం తదితరులు గోవిందుతో చర్చలు జరిపారు. ఇష్టం లేకపోయినా బలవంతంగా వైసీపీ కండువాలు కప్పి ఫొటోలు తీశారని, తమకు వైసీపీ అంటే ఇష్టం లేదని పేర్కొంటూ మెడలో ఉన్న కండువాలను విసిరికొట్టి అప్పటికప్పుడు జనసేన కండువాలు కప్పించుకున్నారు. జనసేన పార్టీలోనే ఉంటామని, ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ గెలుపుకు కృషి చేస్తామని ప్రకటించారు. గ్రామంలో వైసీపీ నాయకులు తమ అధికార బలంతో బలవంతపు చేరికలకు పాల్పడుతున్నారని, మొన్న శెట్టిబలిజసంఘం పెద్దలు, నిన్న అగ్నికుల క్షత్రియ సంఘం పెద్దలను ఇలానే బలవంతంగా వైసీపీ కండువాలు కప్పి ఫొటోలతో హల్‌చల్ చేసినట్టు జనసేన నాయకుడు అనుకుల రాంబాబు తెలిపారు.





గోవిందుకు వైసీపీ కండువా కప్పుతున్న దృశ్యం, అరగంట తిరక్కుండానే జనసేన కండువా కప్పుకుంటున్న గోవిందు

కోడ్ కూసినా పట్టదా?

శంఖవరం, మార్చి 31: ఎన్నికోడ్ అమల్లోకి వచ్చినా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు పట్టడం లేదు. శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ప్రైవేట్ కార్యక్రమంలో ప్రత్తి పాడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అయితే వరుపుల సుబ్బారావు సొంతగ్రామంలో పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న మోహనకుమార్‌బాబు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ఎన్నికల్ కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగి ఇలా వ్యవరించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.



కత్తిపూడిలో సుబ్బారావుతో కలిసి స్టేజ్ మీదున్న లింగంపర్తి కార్యదర్శి మోహన్ కుమార్‌బాబు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



ఆర్టీసీ బస్సును తోస్తున్న ప్రయాణికులు

పిఠాపురం, మార్చి 31: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాకినాడ వెళ్తూ ఆదివారం ఉదయం పిఠాపురం ప్రభుత్వాసుపత్రి సెంటర్‌లో ఆగిపోయింది. మొరాయించిన బస్సు ఎంతకి స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు కిందకు దిగి తోశారు. పలుమార్లు ప్రయత్నిస్తే కాని బస్సు స్టార్ట్ కాలేదు. ఈ దృశ్యాలు ఇటీవల నిత్యకృత్యంగా మారాయి. ఆర్టీసీ కొత్త బస్సులను కొనుగోలు చేయకపోవడంతో కాలం చెల్లిన బస్సులను వివిధ రూట్లల్లో తిప్పుతున్నారు. ఇవి మరమ్మతులకు గురవుతూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.

మల్లేపల్లి హైవేపై నిలిచిపోయిన ట్రాఫిక్

గండేపల్లి, మార్చి 31: మండలంలో మల్లేపల్లి జాతీయ రహదారి సంత మార్కెట్ వద్ద ఆదివారం విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న రెండు కారులను స్వల్పంగా ఢీకొనడంతో కారులో వారు బస్సుడ్రైవర్‌తో ఘర్షణకు దిగారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న గండేపల్లి ఎస్‌ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

పూర్వ విద్యార్థుల చేయూత

కాకినాడ రూరల్, మార్చి 31: కాకినాడ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నలుగురు పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం 4 కుట్టు మిషన్లను ట్రస్ట్ సభ్యులు ఆదివారం అందజేశారు. దుర్గ, శివ ప్రశాంతి, చంద్రకళ, శీలమణిలకు మిషన్లను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రస్ట్ అధ్యక్షులు సీమకుర్తి పాపారావు మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు ఎంతో సహకారమందిస్తున్నారన్నారు. ట్రస్ట్ సభ్యులు జగన్నాధరావు, కళ్యాణి, శేషగిరి, జనార్ధన్, రామ్‌చరణ్, సాయి సురేష్, కుమార్, ప్రసాద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజపతినగరం, మార్చి 31: విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మదుపాడ గ్రామంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన గుర్రే లోవరాజు(50) మృతిచెందాడు. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లోవరాజు ఇటీవల మదుపాడ గ్రామానికి సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో కూలి పని కోసం వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలవ్వగా 108 వాహనంలో గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు గజపతినగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

మహిళ ఆత్మహత్య

కాజులూరు, మార్చి 31: మండలంలో శలపాక గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. శలపాకకు చెందిన చెల్లేటి ఆదిలక్ష్మి (22) ఆదివారం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ఆమెకు భర్త, సంవత్సరం బాబు ఉన్నారు. సంఘటనపై గొల్లపాలెం ఎస్‌ఐ తులసీరామ్ కేసు నమోదు చేశారు. అయితే ఆదిలక్ష్మి మతిస్థిమితం లేని కారణంగా కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు చెబుతున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 31: శ్రీవివేకానంద విద్యాసంస్థల వార్షికోత్సవంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దంటు కళాక్షేత్రంలో ఆదివారం స్కూల్ ఇంద్రపాలెం బ్రాంచ్ 32వ, మధురానగర్ బ్రాంచ్ 21వ వార్షిక వేడుకలు, కేజీ విద్యార్థులకు స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ బీఎస్ సరోజిని కార్యక్రమాన్ని ప్రారంభించగా, ముఖ్య అతిథులుగా చార్టెర్డ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి, పీఎస్ఎం కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు విచ్చేశారు. విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ శిరీష, వికాస్ పాల్గొన్నారు.

‘పోటీతత్వంతో మంచి భవిష్యత్’

కోటనందూరు, మార్చి 31: విద్యార్థులకు పోటీతత్వం అలవర్చాలని, దీని వల్ల విద్యార్థి దశ నుంచే మంచి భవిష్యత్ నిర్ణయించవచ్చని ఎంఈవో అడిగర్ల శ్రీనివాస్ అన్నారు. కోటనందూరు శ్రీసాయి విద్యానికేతన్‌లో 30వ వార్షికోత్సవాన్ని సంస్థ చైర్మెన్ బంగారు లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవోగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో2 శేఖర్, రాంబల్లి రమణ, బంగారు ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కరక నాయుడు, శైలజ తదితరులున్నారు.

కాకినాడలో అన్నదానం

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 31: మెహర్‌నగర్‌లోని శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద 50వ వార్షిక వేడుకలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, రాజారపు మహేష్, మల్లిపూడి వీరు, మల్లిపూడి ఈశ్వర్, ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, మల్లిపూడి ఛత్రపతి శివాజీ గణేష్, దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షుడు ముమ్మిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.